అభివృద్ధి కుంటుపడింది.!

పెండింగ్ పనులను గాలికొదిలేశారు



మానస సరోవర్ హైట్స్‌లో నాలా పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- అధికారులు తీరుపై ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం
- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే
- చెరువులు, నాలాలు, డ్రైనేజీ సమస్యల పరిశీలన
- నేరుగా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ
- వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి ఆరు నెలలు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం లేదని.. నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గతంలో చేపట్టిన పనులను గాలికి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి హస్మత్‌పేట బోయిన్ చెరువును పరిశీలించారు. మానస సరోవర్ హైట్స్ దగ్గర నాలా పరిశీలన డ్రైనేజీ సమస్యలను పరిశీలించి స్థానిక నాయకులతో మాట్లాడారు.

గుర్రపుడెక్కను ఎందుకు తొలగించడం లేదు.?

◆ చెరువులో పెరిగిన గుర్రపుడెక్కను ఎందుకు తొలగించడం లేదని అధికారులను ప్రశ్నించారు. నాలా పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. గుర్రపుడెక్క తొలగించే కాంట్రాక్ట్ సమయం అయిపోయిందని అధికారులు తెలిపారు. కొత్తగా టెండర్లు పిలిచి సంబంధిత పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాలని ఎమ్మెల్యేతో చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా చర్యలు తీసుకుని పనులు చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వ వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా..

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో బోయిన్‌చెరువులో గుర్రపుడెక్క పెరగకుండా తొలగించిడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకునే వాళ్లమని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులో గుర్రపు డెక్క పెరిగి దోమలు వృద్ధి చెంది ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన నాలా పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు పనులు చేయకపోవడంతోనే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని అన్నారు. ఎస్సీ బస్తీలో కమ్యూనిటీహాల్ పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులు, సంబందిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి..

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారులు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన పనుల కోసం జిల్లా మంత్రులను కలసి బడ్జెట్ తీసుకోస్తామని ఆయన తెలిపారు. అంతకు ముందు మందుల బస్తీలో ఉన్న అమ్మవారి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవిందరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ ఏఈ తేజ, షంషేర్, టౌన్ ప్లానింగ్ సోమేష్, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, విద్యుత్, పోలీసు విభాగాల అధికారులు, నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, బాలరాజు, మన్నే ఉదయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బోయిన్ చెరువు వద్ద కార్పొరేటర్‌తో ఎమ్మెల్యే..

అధికారులతో సమీక్ష.. నేరుగా ఫిర్యాదుల స్వీకరణ



ఓల్డ్ బోయిన్‌పల్లి వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో రోడ్లు, కమ్యూనిటీహాల్, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ సమస్యలను స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకొని వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కూకట్‌పల్లి జోనల్ నూతన కమిషనర్‌గా అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ నూతన కమిషనర్‌గా అపూర్వ చౌహాన్ నియమితులయ్యారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అపూర్వ్ చౌహాన్‌ను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలో లోకల్ బాడీస్‌కి సంబంధించి అడిషనల్ కలెక్టర్‌కు పని చేస్తున్న అపూర్వ్ చౌహాన్‌ను నూతన జెడ్సీగా నియమించారు. కాగా ఇక్కడ జెడ్సీగా విధులు నిర్వర్తించిన జెడ్సీ అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ సమీపంలోని రాజీవ్ నగర్ పార్కులో నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25న మంగళవారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు పార్కు వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, చర్మ, దంత, ముక్కు, గొంతు, నోరుతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. పరిసర ప్రాంతవాసులు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి



సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీవాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరలో పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ,సెక్రటరి స్వరూప, జనరల్ సెక్రటరీ హన్మంతరావు, ఉపాధ్యక్షులు రఘుపతిరావు, మురళీకృష్ణ, ట్రెజరర్ శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పగలూ వెలుగులు



నల్లపోచమ్మ ఆలయం సమీపంలో వెలుగుతున్న వీధి లైటు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ నల్లపోచమ్మ ఆలయం సమీపంలో పగలు వీధిలైట్లు వెలుగుతున్నాయి. ఆన్ ఆఫ్ సిస్టం ఉన్నప్పటికీ వాటిని ఆఫ్ చేయకపోవడంతో పలు ప్రాంతాల్లో వీధి లైట్లు పగలు వెలుగుతున్నాయి. సాయంత్రం 6 గంటలకు లైట్లు వేసి ఉదయం 6 గంటలకు ఆఫ్ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వీధి లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల అదనపు అంతస్తు ప్రారంభం



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి,ఉపాధ్యాయులు

బాలానగర్: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు అంతస్తును నిర్మించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో వీలైనంత త్వరగా నిర్మించినట్లు సోమవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన పాఠశాల హెచ్‌ఎం అరుణజ్యోతి, ఉపాధ్యాయులతో కలిసి అదనపు అంతస్తును నిర్మించినట్లు తెలిపారు.

వార్డు కార్యాలయంలో సమీక్షా సమావేశం



వార్డు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లో సోమవారం జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా వచ్చే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తల గురించి చర్చించారు. మంజూరు అయిన రోడ్లు, సీవరేజ్ లైన్లు వీలైనంత త్వరగా పూర్తి చేయించాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు ఆఫీసర్ వాహిద్ అలీ, ఏఈ ఆశ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ ప్రియాంక, సీఓ సుజాత, ఎస్ఆర్‌పీ వినాయకాంత్, హార్టికల్చర్ సూపర్‌వైజర్ దివ్య, వర్కు ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎంటమాలజీ సూపర్ వైజర్ నరేష్, జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ లైన్‌మెన్ భద్రయ్య పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసి ఐదుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. విద్యార్థి జేఏసీ నేత మోతీలాల్ ఆధ్వర్యంలో గ్రూప్–2, 3, ఇతర ఉద్యోగాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లోనూ నిరాహార దీక్షను కొనసాగిస్తామని మోతీలాల్ నాయక్ తెలిపారు.

లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించండి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్‌కు సోమవారం ఇండ్ల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం పూర్తయి, లబ్ధిదారుల ఎంపికకు సర్వే కూడా చేపట్టారని, అయినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. బన్సీలాల్‌పేట నీలం బాలయ్యదొడ్డి ప్రాంతంలో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి అక్కడి పేదవాళ్లను తరలించే ప్రయత్నం చేయగా తాము అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేసి అది ప్రభుత్వ స్థలామని నిరూపించి అక్కడ హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలోని కొందరి నాయకుల సహకారంతో మళ్లీ ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. అందించిన వారిలో బీజేపీ యువ నాయకులు మర్రి పురురావరెడ్డి, నాయకులు సత్యనారాయణ, రఘునాథ్‌గౌడ్, కుమార్, దయానంద్, శ్రీలత, సంతోష్, పరమేశ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

బాలానగర్: గౌతమ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బోయిన్‌పల్లికి చెందిన శ్రీరాఘవేంద్ర ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి డివిజన్‌లోని బస్తీల్లో వారానికోసారి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరాలను బస్తీల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ప్రతినిధి సునీల్, శశి, బాగయ్య, సురేందర్‌నాయుడు, సలావుద్దీన్, బాలమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు ఓయూ రిజిస్ట్రార్ విరాళం

ఉస్మానియా యూనివర్సిటీ: ఆదివాసీ విద్యార్థులకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ సొంతంగా రూ.50 వేలను విరాళంగా అందజేశారు. అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ములుగు జిల్లా మేడారానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గల సారలమ్మ గుంపు ఆదివాసీ గూడెంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన బీసీహెచ్‌సీ ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదివాసీ పిల్లల చదువుల కోసం ఓయూ పూర్వ విద్యార్థులు ఈసం సంతోష్, నరేశ్ ఇతర మిత్రులతో కలిసి నాలుగేళ్ల క్రితం పాఠశాల ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతితో పాటు పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో గ్రూప్‌-2, 3 పరీక్షలు నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–2, 3 పరీక్షలను డిసెంబర్‌లో నిర్వహించాలని నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ అధికారులతో చర్చించాలని కోరుతూ సోతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. డిసెంబర్‌లో జరిగే డీఎస్సీతో పాటు గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహించేలా చూడాలని కోరినట్లు నిరుద్యోగులు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి



కేపీహెచ్‌బీకాలనీ రైతుబజార్ వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తామని మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రైతుబజార్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీ చేయటం చరిత్రలో నిలిచిపోయే అంశమన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు అరవిందరెడ్డి, రజితమ్మ, బోజమ్మ, మేకల మైఖేల్, సంజీవరావు, బాబ్జీకుమార్, బీ–బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, నాగమల్లేశ్వరరావు, బండి సుధా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం

హాజరుకానున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 25న (నేడు) ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట మాజీ అధ్యక్షుడు ప్రొ.శంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న విద్యాసాగర్ రావు నాటి చరిత్రను విద్యార్థులకు వివరిస్తారని, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రవ్యాప్తంగా రేపు (26న) పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ నాయకులు ఓయూలో సోమవారం తెలిపారు. ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని అధిక ఫీజులు వసులు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ పై బంద్ చేస్తున్నట్లు ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ పృథ్వీతేజ పేర్కొన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు ఇవ్వలేదని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు విద్యార్థులతో పాటు తల్లిందండ్రులు, టీచర్లు, ఉద్యోగులు సహకరించాలని ఆయన కోరారు.

అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటాం



సనత్‌నగర్‌లో బాలానగర్ డీసీపీ

సనత్‌నగర్: నిఘాను మరింత కట్టుదిట్టం చేసి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటామని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌టీకాలనీ, జెక్‌కాలనీ, డీఎస్‌ఎంకాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం పర్యటించి శాంతి భద్రతల విషయంలో పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. అలాగే ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది విధులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థ, వారి పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరగాలన్నారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు, మట్టికుప్పలను తొలగించాలి



గాయత్రినగర్ నాలుగు కూడళ్ల వద్ద మట్టికుప్పలు, నిర్మాణ వ్యర్థాలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ నాలుగు కూడళ్ల వద్ద రోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పలు, నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రోడ్డు హైటెక్ సిటీ దారి కావడంతో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రతి బుధవారం ఒక్కడ సంత జరుగుతుంది. అప్పుడు వాహనదారులు ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. ఈ ప్రాంతంలో వ్యాపార సంస్థలు, పాఠశాలలు ఉన్నాయి. అలాంటి ఈ రోడ్డు పక్కనే మట్టి కుప్పలు, టర్నింగ్ పాయింట్ వద్ద తోపుడు బండ్లు ఉంచటంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక వర్షాలు పడుతుండటంతో మట్టి రోడ్డుపైకి వచ్చే అవకాశముందని ఇప్పటికైనా పారిశుద్ధ్య కార్మికులు స్పందించి మట్టి కుప్పలను తొలగించాలని కోరుతున్నారు. స్థానికులు దీనిపై పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'మనూ'లో ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మెరిట్ ఆధారిత కోర్సులలో ప్రవేశాలకు జూన్ 30వ తేదీ ఆఖరు అని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ సోమవారం తెలిపారు. యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా, హైదరాబాద్‌లోని ప్రధాన క్యాంపస్, శాటిలైట్ క్యాంపస్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని ఆమె వివరించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. మెరిట్ ఆధారిత పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు,ఎంఎస్‌డబ్ల్యూ(సోషల్ వర్క్), జర్నలిజమ్, మాస్ కమ్యూనికేషన్, ఎంఏజేఎంసీ(లేటరల్ ఎంట్రీ) ఎంకామ్, ఎంఎస్సీ, ఒకేషనల్ కోర్సులు, ఎంఎల్‌టీ, ఎంబీటీ, పీజీ డిప్లొమో ఇన్ టీచింగ్ ఇంగ్లీష్, ఎంసీఏ (లేటరల్ ఎంట్రీ), పీజీ డిప్లొమో కోర్సులు, వివిధ సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఇతర వివరాలకు అడ్మిషన్ హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్లు 6207728673,9866802414, 6302738370, 75004693643లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రొ.ప్రభాకర్‌రావుకు అంతర్జాతీయ అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జే ప్రభాకర్‌రావుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ప్రభాకర్‌రావుకు ఇన్ఫర్మేషన్ సొసైటీ డెవలప్‌మెంట్‌కు చేసిన కృషికి ఎవ్జెనీ కుజ్మిన్ ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. ఇటీవల యునెస్కో ఇంటర్ గవర్నమెంటల్ ఫ్రేమ్‌వర్క్‌లో రష్యన్ ఫెడరేషన్‌లోని ఖాంటీ మాన్సిస్క్‌లో జరిగిన ఆరవ 'టాంజిబుల్ అండ్ ఇంటాంజిబుల ఇంపాక్ట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ఇన్ ది డిజిటల్ ఏజ్' అంతర్జాతీయ సదస్సులో ప్రభాకర్‌రావు అవార్డును స్వీకరించారు.

ఓయూ వీసీగా ఎస్సీని నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వందేళ్లు పూర్తి చేసుకున్న ఓయూకు ఓసీలే వీసీలుగా ఉంటున్నారని సోతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు, రెడ్డిలు, బ్రహ్మణులు, బీసీలు తదితర సామాజిక వర్గాలకు చెందిన ప్రొఫెసర్లు ఓయూకు వీసీలుగా పని చేశారని, కానీ ఇప్పటివరకు ఎస్సీలు, ఎస్టీలు, క్రిష్టియన్లు, మహిళలు, దివ్యాంగులు వీసీలుగా నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలు, ఎస్టీలు దేశానికి రాష్టపతులుగా పని చేశారని, కానీ ఓయూ వీసీగా మాత్రం అవకాశం రాలేదని, ఈసారైన ఎస్సీ ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.